క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం సెంట్రల్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని వైఎస్ విగ్రహం వద్ద, 11.30 గంటలకు ఆంధ్రప్రభకాలనీ జనహిత సదనం వద్ద వైఎస్సార్ జయంతి వేడుకలు జరుగుతాయన్నారు. నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, పార్టీ జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, డివిజన్ కోఆర్డినేటర్లు, అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

ముగిసిన స్థాయీసంఘం సభ్యుల నామినేషన్లు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ అభివృద్ధికి ఏర్పాటయ్యే స్థాయిసంఘం సభ్యుల ఎన్నికకు కార్పొరేటర్ల నుంచి నామినేషన్‌ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. ఆరుగురు సభ్యులుండే సంఘానికి వైఎస్సార్ సీపీ నుంచి 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రహమతున్నీసా, 19వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ రెహానా నాహిద్, 21వ డివిజన్ కార్పొరేటర పుప్పాల కుమారి, 1వ డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి.. వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్‌కు నామినేషన్లు సమర్పించారు. అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ అనంతరం జరిగే స్క్రూటినీ మంగళవారంతో జరగనుంది. స్థాయీసంఘం సభ్యులుగా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఏకగ్రీవయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక ఏపీఎస్ రెడ్డి రోడ్డులో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపాటి వెంకటేశ్వరరావు మాదిగ, లింగాల నరసింహులు, నూకపోగు యేసు, కాల్వ ప్రసాద్, నగిరికంటి వినయ్‌కుమార్, రాంబాబు, కాంపాటి శివ, ప్రకాష్, వెంకయ్య, కె.వాణి, నీలిమా, టీడీపీ నాయకులు శ్రీను, బత్తుల కొండ తదితరులు పాల్గొన్నారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 10వ తేదీ గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు తంగెళ్లమూడి వీర మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 5.30 గంటలకు కాకడ హారతితో గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. అలాగే చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని శ్రీకల్యాణ సాయిబాబా మందిరంలోనూ గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూధనరావు తెలిపారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని బాబావారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని జంధ్యాల దక్షిణామూర్తి ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంత సేవా సంస్థ ఛైర్మన్ పెనుమత్స అప్పలరాజు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం ఎంతో గొప్పదని అన్నారు. నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ఎల్లప్పుడు ముందుండాలని పిలుపునిచ్చారు. భోజనం ప్లేట్లు, ఇతర పరికరాలను కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. స్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి, లారీ ఓనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వత్సవాయి కృష్ణంరాజు, ట్రెజరర్ ఏహెచ్‌వీ సురేష్, వైస్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, వాంబే కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.రామరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న గంజాయి బ్యాచ్

- రౌడీషీటర్లు, ఆకతాయిలకు అడ్డాగా సింగ్‌నగర్
- రోడ్లపై నడవాలంటేనే హడలిపోతున్న యువతులు, మహిళలు
- వరుస ఘటనలతో స్థానికులు గగ్గోలు



గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా మారిన ఇందిరానాయక్‌నగర్ బుడమేరు ప్రాంతం ఇదే

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఈ ప్రాంతంలో కొంతమంది రౌడీషీటర్లు, ఆకతాయిలు, గంజాయి బ్యాచ్ సభ్యుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. దీంతో ఈ రోడ్లపై పట్టపగలు ఒంటరిగా నడవాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. ప్రధానంగా విద్యార్థిని విద్యార్థులు, యువతులతో పాటు ఇళ్లల్లో ఉంటున్న ఒంటరి మహిళలు సైతం ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు

- సింగ్‌నగర్ వాటర్ ట్యాంక్ రోడ్డులో కేశవరపు సాంబశివరావు, దుర్గాంబ(70) దంపతులు నివసిస్తున్నారు. గత నెల 16వ తేదీన దుర్గాంబ ఒక్కరే ఇంటిలో ఉన్నారు. దీన్ని గమనించిన ఓ గంజాయి బ్యాచ్ సభ్యుడు పట్టపగలే ఆ ఇంటిలోకి చొరబడి ఆమె గొంతు నులిమి దుర్గాంబ ఒంటిపై ఉన్న ఆరుకాసుల బంగారు గాజులతో ఉడాయించాడు.
- సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈ నెల 4వ తేదీన కళాశాల నుంచి బైకుపై తన ఇంటికి వెళ్తుండగా అదే ప్రాంతానికి చెందిన ఒక రౌడీషీటర్ ఆ యువకుడిని అడ్డగించి అకారణంగా దాడి చేశారు.
- మే 14వ తేదీన చిట్టినగర్‌లో జరిగిన ఓ గొడవ విషయమై సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేట దూరంలో ఉన్న న్యూరాజరాజేశ్వరీపేట ఏటీఎం సెంటర్ వద్ద రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్ సభ్యులు కట్టర్లు, బ్లేడ్లు, కత్తులతో వీరవిహారం చేసి స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు.
- సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ వద్ద ఈ నెల 5వ తేదీన గంజాయి బ్యాచ్ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థినులను అడ్డగించి అసభ్యకరంగా ప్రవర్తించారు.



అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్

న్యూరాజరాజేశ్వరీపేట, సింగ్‌నగర్ రైల్వే లైన్ లూనాసెంటర్, లెనిన్‌సెంటర్, బుడమేరు పరిసర ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ రోడ్లపై మాటువేసి అటుగా రాకపోకలు సాగించే వారిని బెదిరించి వారి వద్ద డబ్బులు లాగేసుకుంటున్న ఘటనలు ఇక్కడ నిత్యకృత్యంగా మారాయి. ఇలా చెప్పుకుంటూ పోతే సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లు, ఆకతాయిల అల్లర్లకు అడ్డు అదుపు లేకుండా పోతోంది.

ఆకతాయిల అడ్డాలు

సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, ఇందిరానాయక్‌నగర్, వాంబేకాలనీ పరిసర ప్రాంతాలను ఆకతాయిలు తమ అడ్డాలుగా మార్చుకున్నారు. చీకటి పడితే పదుల సంఖ్యలో ఆకతాయిలు ఇక్కడకు చేరి గంజాయి, మద్యం సేవించడం అటుగా రాకపోకలు సాగించే వారిపై దాడులు, దౌర్జన్యాలు చేసి డబ్బులు దండుకోవడం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఈ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంటున్న సంఘటనలు, నమోదవుతున్న కేసులను పరిశీలించి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భయంగా ఉంటుంది



సింగ్‌నగర్‌లో గంజాయి బ్యాచ్, ఆకతాయిల సమస్యలు ఇటీవల కాలంలో అధికం అయ్యాయి. ఆడపిల్లలని బయటకు పంపాలంటేనే చాలా భయంగా ఉంటుంది. స్కూల్స్ వద్ద ప్రత్యేక పోలీసు బీట్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– షేక్ రాబియా, సింగ్‌నగర్

బంగారు గాజులు లాక్కెళ్లారు



సింగ్‌నగర్ వాటర్ ట్యాంక్ రోడ్డులో ఆకతాయిలు అల్లర్లకు పాల్పడుతుంటారు. పట్టపగలే నా మీద దాడి చేసి బంగారు గాజులు లాక్కెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉండాలంటేనే భయంగా ఉంటుంది. పోలీసులు ఆకతాయిలపై చర్యలు తీసుకొని, మాకు రక్షణ కల్పించాలి.

– కె.దుర్గాంబ, బాధితురాలు

విద్యతోనే ఉన్నత శిఖరాలు



సాయి షణ్ముఖను సత్కరిస్తున్న న్యూస్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి విద్యకు మించిన ఆయుధం లేదని వక్తలు పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో సోమవారం నాయీ బ్రాహ్మణ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సర్వీస్(న్యూస్) ఆధ్వర్యాన ఇటీవల ప్రకటించిన సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీసుకు ఎంపికైన గులూరు సాయి షణ్ముఖ అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు కేవీ మోహన్‌రావు మాట్లాడుతూ విద్య వల్ల ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు న్యూనతను అధిగమించవచ్చన్నారు. ఐఏఎస్ అధికారి బి. రామారావు మాట్లాడుతూ అంకిత భావం కలిగిన వారు మాత్రమే సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. సివిల్స్‌లో విజయం సాధించిన సాయి షణ్ముఖ మాట్లాడుతూ తాను సాధారణ విద్యార్థినని, తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహం, పట్టుదలతో పాటు నిరంతర కృషి ఫలితంగా సివిల్స్ ర్యాంక్ సాధించానని తెలిపారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం. రవీంద్రనాథ్‌బాబు అధ్యక్షత వహించిన ఈ అభినందన సభలో రచయిత డాక్టర్ ప్రభాకర్ రచించిన 'కాశీ రహస్యం' అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీసీ మీరా ప్రసాద్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ ఎ.వి. నాంచారరావు, ప్రకాశం జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరక్టర్ పి. శ్రీహరి, సురేంద్రబాబు, శేషయ్య, సీనియర్ పాత్రికేయుడు అన్నవరపు బ్రహ్మయ్య, సాయి షణ్ముఖ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో అగ్నిప్రమాదం

రూ. 6 లక్షల ఆస్తి నష్టం



అగ్నికి ఆహుతి అవుతున్న ఇల్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఓ శవయాత్రలో కాల్చిన బాణాసంచా వచ్చి పడటంతో సింగ్‌నగర్‌లో ఒక తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ చింతావారి వీధిలో పోతనబోయిన సూర్యకుమారి, దుర్గారావు దంపతులు ఓ పూరింటిలో నివసిస్తున్నారు. వీరితోపాటు దుర్గారావు తల్లి నాంచారమ్మ, కూతురు మహేశ్వరీ కూడా ఉంటున్నారు. అయితే సింగ్‌నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి చనిపోవడంతో ఆ శవయాత్ర డాబాకొట్లు సెంటర్ మీదుగా వెళ్లింది. ఈ యాత్రలో కాల్చిన బాణాసంచాలోని ఓ తారాజువ్వ సూర్యకుమారి ఇంటిపై పడి నిప్పంటుకుంది. క్షణాల్లోనే దాని నుంచి మంటలు వ్యాపించడంతో ఇంటిలో ఉన్న దుర్గారావు, నాంచారమ్మలు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసేలోపు ఇల్లు, ఇంటిలోని సామాన్లన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంటిలో వారు దాచుకున్న డాక్యుమెంట్లు, కుమార్తె వివాహం కోసం కూడబెట్టుకున్న నగదు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.6 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

తప్పిన పెను ప్రమాదం

అగ్నిప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఆ ఇంటిలో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లను గుర్తించి బయటకు తీసుకువచ్చిపడేశారు. లేకుంటే గ్యాస్ బండలు పేలి పెనుప్రమాదమే చోటుచేసుకునేది. అగ్నిప్రమాదంలో అన్నీ కాలిపోవడంతో కుటుంబం మొత్తం కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. బాధితులను మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్‌తో కలసి పరామర్శించారు.



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు

ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

పటమట(విజయవాడతూర్పు): అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో ఆయన నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రధాన కార్యాలయంలో నిర్వహించడమే కాకుండా జోనల్ కార్యాలయం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. ఆయన గతవారం ఫిర్యాదు చేసిన దరఖాస్తుల్లో పునరావృతమైన వాటిని సమీక్షించారు. ఇవి తిరిగి రాకుండా ప్రజల ఫిర్యాదులను ఎలా పరిగణించాలి, ఎలా పరిశీలించాలి, ఎలా పరిష్కరించాలి వంటి అంశాలపై అధికారులకు సూచించారు. పురమిత్ర యాప్‌లో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి వాటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు వంటి అంశాలను చర్చించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యను అర్థం చేసుకొని శాశ్వతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 22 ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 10, ఇంజినీరింగ్ 8, వైద్య – ఆరోగ్యం 1, హార్టికల్చర్ 3 మొత్తం కలిపి 22 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్). డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జున్ రావు, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీపై సీపీఎం ఫిర్యాదు

నగరంలో పదివేల వృద్ధులు, వితంతు వికలాంగులు, ఒంటరి మహిళల పెన్షన్లు పెండింగ్‌లో ఉంటే కేవలం 675లో మాత్రమే.. చనిపోయిన వారి స్థానంలో మంజూరు చేశారని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు సోమవారం పీజీఆర్ఎస్‌లో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మరావతి బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని నలంద విద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి సోమేశ్వరరావు ద్వితీయ బహుమతి సాధించాడు. సోమేశ్వరరావును ఎంఈఓ వెంకటరత్నం, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం హుస్సేన్, స్కూల్ పీడీలు హవీలా, కిషోర్‌లు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. చదరంగంలో సోమేశ్వరరావు మరింత పట్టు సాధించి నగరానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎన్‌సీసీ మాస్టర్ ప్రకాష్, స్కూల్ ఉపాధ్యాయులు సోమేశ్వరరావును అభినందించారు.

చోరీల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గుణదల(విజయవాడ తూర్పు): చోరీలను నియంత్రించడంలో పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. గుణదల ఒకటవ డివిజన్‌లో సోమవారం ఆయన పర్యటించారు. ఇటీవల జరిగిన చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు నానాటికీ పెరిగిపోతున్నాయని తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లలో చోరీలకు పాల్పడి విలువైన సొత్తును దొంగిలిస్తున్నారని పేర్కొన్నారు. గత శుక్రవారం గుణదల రైల్వేస్టేషన్ సమీపంలోని కాలనీలో జరిగిన చోరీ గురించి గుర్తు చేశారు. బంగారు ఆభరణాలు దొంగిలించి పరారైన నిందితులను అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. ముఖ్యంగా ఒకటవ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో పోలీసులు భద్రతా చర్యలు ముమ్మరం చేయాలన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. స్థానికులు సైతం అప్రమత్తంగా ఉండి అనుమానితుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు మహేశ్వరరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు





మధురానగర్ రైల్వేస్టేషన్ రోడ్డులో చెత్తకు నిప్పుపెట్టడంతో వస్తున్న పొగ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంకి పెళ్లి సుబ్బిచావుకి వచ్చిన చందంగా మారింది మధురానగర్ రైల్వేస్టేషన్ రోడ్డు వాసుల పరిస్థితి. ఇక్కడ నగరపాలకసంస్థ సిబ్బంది శుభ్రం చేస్తారంటూ రైల్వే అధికారులు, రైల్వే సిబ్బంది చేస్తారని వీఎంసీ సిబ్బంది చెబుతూ పరిసరాలను పట్టించుకోవడం లేదు. అయితే అప్పుడప్పుడు శుభ్రం చేస్తున్నారని.. శుభ్రం చేసినందుకు ఆనందపడాలో బాధపడాలో తెలియడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుభ్రం చేసినప్పుడు తరలించాల్సిన చెత్తను అక్కడే ఒకచోటకు చేర్చి నిప్పుపెడుతున్నారు. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు తగులపెట్టడం వల్ల వచ్చే పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పొగ వల్ల శ్వాసకోశ సంబంధిత సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొగ పెట్టకుండా చెత్తను తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాంగ్ పార్కింగ్ చేస్తే వాహనాలు సీజ్



సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): పోలీస్ కమిషనర్ ఎస్.వి రాజశేఖరబాబు, ట్రాఫిక్ డీసీపీ ఎ.వి.ఎల్ ప్రసన్న ఆదేశాల మేరకు మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్ బాబు సత్యనారాయణపురం పరిధిలో రాంగ్ పార్కింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ ప్రాంతంలో ఇతర వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రల వాహనాలను టోయింగ్ వెహికల్ ద్వారా తొలగించి వాటి యజమానులకు జరిమనాలు విధించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ రాంగ్ పార్కింగ్ చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై బార్ యజమాని దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విధి నిర్వహణలో ఉన్న పోలీసు కానిస్టేబుల్‌పై బార్ యజమాని దాడి చేసిన ఘటన సోమవారం అయోధ్యనగర్‌లో జరిగింది. రామకృష్ణాపురంలో నివాసం ఉంటున్న గుడివాడ సురేష్(1049)అనే కానిస్టేబుల్ క్రైమ్‌స్పాట్‌లో పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో పనిచేశారు. విధి నిర్వహణలో భాగంగా సురేష్ బైక్‌పై ఇబ్రహీంపట్నం వెళుతూ ఇంటి నుంచి అయోధ్యనగర్‌లోని రాఘవేంద్ర థియేటర్ వద్ద గల ఆదిసత్య బార్ అండ్ రెస్టారెంట్ సమీపానికి చేరుకున్నాడు. బార్ యజమాని శ్రీనివాసరావు కారు కానిస్టేబుల్ సురేష్ బైక్ తగిలింది. చూసుకుని కారు నడపండి అని బార్ యజమానితో సురేష్ అన్నాడు. దీంతో ఆగ్రహించిన శ్రీనివాసరావు కానిస్టేబుల్ చెంపపై కొట్టాడు. అంతటితో ఆగకుండా బార్‌లో పనిచేసే సిబ్బందిని పిలచి కానిస్టేబుల్‌పై దాడిచేయండని ఆదేశించాడు. బార్ నుంచి బయటకు వచ్చిన సిబ్బందిలో కొందరు కానిస్టేబుల్‌ను గుర్తించి తమ యజమానికి చెప్పారు. పోలీసు అని చెప్పినప్పటికీ సురేష్‌ను కొట్టాలని మరోసారి బార్ యజమాని శ్రీనివాసరావు వారిని ఒత్తిడి చేశారు. సిబ్బంది అందుకు నిరాకరించారు. దీనిపై కానిస్టేబుల్ గుడివాడ సురేష్ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు బార్ యజమానికిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



సారెను సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాలు కొత్తపల్లి రజని, తదితరులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు సోమవారం వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాలు కొత్తపల్లి రజని, నగరానికి చెందిన పలువురు మహిళలు సారెను సమర్పించారు. వారికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. తెలుగు ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో రైతులు సంతోషంగా ఉండాలని కోరుతూ అమ్మవారికి సారెను సమర్పించినట్లు పేర్కొన్నారు. అన్నపూర్ణ, వసుందర, సునీత, అరుణ, ప్రతిమ, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

కులగణనను పారదర్శకంగా నిర్వహించాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కులగణన పారదర్శకంగా నిర్వహించాలని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ (ఏబీఎస్పీ) జాతీయ కో–ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. మొగల్రాజపురం రత్నమాంబవీధిలో ఏర్పాటు చేసిన పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనను పారదర్శకంగా నిర్వహిస్తేనే అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. దళిత క్రిస్టియన్స్‌కు ఎస్సీ హోదా ఇవ్వాలని, రాజధాని అమరావతిలో పేదలు నివాసానికి ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశానంతరం విజయవాడకు చెందిన పానుగుపాటి శ్రీనివాస్‌ను పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు ప్రకటించారు. ఏబీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ బి.పరంజ్యోతి, రాష్ట్ర అధ్యక్షుడు లకే రాజారావుతో పాటుగా వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.